# 'పోటా' పేరుతో తిరిగివస్తున్న టాడా నువ్యతిరేకిద్దాం రండి

'పోటో'కు చట్టరూపం ఇవ్వాలని కృత నిశ్చయులయి ఉన్నట్టు దేశప్రధాన మంత్రి, హోంమంత్రి పదే పదే ప్రకటిస్తున్నారు. వద్దని ప్రతిపక్షాలూ హక్కుల సంఘాలూ ప్రజాస్వామికవాదులే కాక జాతీయ మానవహక్కుల కమిషన్ కూడా వారిస్తున్నప్పటికీ ఆ చట్టాన్ని తెచ్చే తీరుతామని ప్రతిజ్ఞలపైన ప్రతిజ్ఞలు చేస్తూ ఉన్నారు.

పైగా ఆ చట్టాన్ని సమర్థించే వాళ్లే దేశభక్తులనీ దానిని వ్యతిరేకించేవారు టెర్రరిస్టులను ప్రేమించే దేశద్రోహులనీ దబాయిస్తున్నారు.

అయినప్పటికీ ఆ చట్టం రాకూడదనే మేము అంటున్నాం. ఎందుకు? టెర్రరిజం వర్థిల్లాలని కోరుకుంటున్నాం కాబట్టా?

'టెర్రరిస్టు' అనే మాటను నిర్వచించడం ఐక్యరాజ్యసమితికే ఇప్పటి దాకా సాధ్యం కాలేదు. చాలా కాలంగా ప్రయత్నం చేస్తూ విఫలమవుతూ ఉంది. ఒకరికి టెర్రరిస్టులుగా కనిపించేవారు మరొకరికి విప్లవకారులుగానో స్వాతంత్ర్య సమరయోధులుగానో కనిపించడం సమకాలీన రాజకీయవాస్తవాలలో ఒకటి.

అయినప్పటికీ, సామాన్య ప్రజలలో భయోత్పాతం కలిగించే బీభత్సకాండను గుర్తించగలం. అటువంటి బీభత్సకాండ పదిలంగా ఉండాలనీ వర్థిల్లాలనీ ఎవరూ కోరుకోము.

అయినా పోటోను వ్యతిరేకిస్తున్నాం. అదేదో 'మానవహక్కులు' అనే అవాస్తవికమైన ఆదర్శాన్ని నమ్ముకున్నవాళ్లు మాత్రమే వ్యతిరేకించవలసింది కాదనీ ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వారందరూ వ్యతిరేకించ వలసిందనీ చెప్పదలచుకున్నాం.

ఎందుకు?

ఎంత ఘోరమైన నేరాన్నయినా న్యాయబద్ధంగా శిక్షించాలని మీరు ఒప్పుకుంటారని ఆశిస్తాము. న్యాయవ్యవస్థ అన్యాయమైన పద్ధతులను అనుసరించడం మొదలు పెడితే అది దోషులను శిక్షిస్తుందో అమాయకులను శిక్షిస్తుందో ఎవరూ చెప్పలేరు.

అమాయకులను భయోత్పాతానికీ హింసకూ గురి చేస్తాయనే కదా మనం టెర్రరిస్టు చర్యలను వ్యతిరేకిస్తున్నాం! అటువంటప్పుడు అమాయకులను కటకటాల పాలు చేయగల టెర్రరిస్టు చట్టాలను ఆమోదించగలమా?

పోటో ఎందుకు అన్యాయమైన చట్టమో చూద్దాం. పోటో కింద అరెస్టయిన వ్యక్తిని బెయిలు ఇవ్వకుండ విచారణ ముగిసే దాకా జైలులోనే ఉంచి, పరాయి రాష్ట్రంలో భాషతెలియని చోట జైలు నాలుగు గోడల మధ్య విచారించవచ్చు. సాక్షులపేర్లు, చిరునామాలు రహస్యంగా ఉంచి క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశం లేకుండా చేయవచ్చు. జైలులో ఉండగా ఎప్పుడయినా పోలీస్ కస్టడీకి తీసుకుని తలకు తుపాకీ పెట్టి నేరం 'ఒప్పించి' ఆ ఒప్పుకోలును కాగితం మీదికి ఎక్కించి కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చు. లేదా కస్టడీకి తీసుకున్న ముద్దాయిని నేరం జరిగిన చోటికి తీసుకుపోయి అక్కడ ఒకటో రెండో వేలిముద్రలు వేయించి 'నేరం జరిగిన స్థలంలో ఇతని వేలిముద్రలు దొరికాయి కాబట్టి ఇంక అతనే తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలి' అని కోర్టుకు చెప్పవచ్చు. నేరానికి ఉపయోగించిన ఆయుధమేకాదు, దానిని 'పోలినది' ముద్దాయి దగ్గర దొరికినా- లేక పోలీసులు ముద్దాయి చేతిలో పెట్టినా- నేరం తాను చేయలేదని ముద్దాయే రుజువు చేసుకోవలసి ఉంటుంది.

ఈ రకమైన నేరవిచారణ పద్ధతే 'టెర్రరిస్టు చర్య' కాదా? ఒక ముద్దాయిని బోనులో నిలబెట్టి విచారించేటప్పుడు పరీక్షకు నిలబడేది ఆ ముద్దాయి విలువలు కాదనీ అతనిని విచారిస్తున్న న్యాయవ్యవస్థ విలువలనీ గుర్తించగలవాళ్లెవరూ ఈ రకమైన నేరవిచారణ పద్ధతిని ఆమోదించజాలరు.

**ఊరేగింపు**

**డిసెంబర్ 10, 2001**

**ఉదయం 10 గంటలకు**

**బాగ్‌లింగంపల్లి పార్క్ నుండి**

**ఇందిరా పార్క్ వరకు**

కాగా, నిషిద్ధ సంస్థలకూ టెర్రరిస్టు సంస్థలకూ వాటి లక్ష్యాలకూ ఏ రకంగానయినా సహకరించినా మద్దతు ఇచ్చినా మద్దతు ఆహ్వానించినా వాటి కార్యకలాపాలకు అవకాశం కల్పించినా ప్రోత్సహించినా ఈ చట్టం కఠినంగా శిక్షిస్తుంది. వీటిలో కొన్ని నేరాలకు పది సంవత్సరాల జైలు శిక్ష వేస్తుంది. కొన్నిటికి జీవితఖైదు వేస్తుంది.

ఇందులో తప్పేముందని అడగవచ్చు. హింసాకాండకు మద్దతు ఇవ్వడం, సహకరించడం, ప్రోత్సహించడం నేరం కదా అనవచ్చు.

సాధారణ చట్టాలు కూడా ఒక నేరాన్ని ప్రోత్సహించడాన్ని, ఒక నేరానికి సహకరించడాన్ని నేరంగానే గుర్తిస్తాయి. కానీ సమస్య ఎక్కడ వస్తుందంటే 'నిషిద్ధ సంస్థ'లు, 'టెర్రరిస్టు సంస్థలు' అన్నీ కూడా రాజకీయ సంస్థలే. వాటి రాజకీయ లక్ష్యాలు మనకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. ఏ రాజకీయ లక్ష్యం కోసమైనా హింస ప్రయోగించడాన్ని మనం ఒప్పుకోవచ్చు, ఒప్పుకోకపోవచ్చు.

అయినప్పటికీ అవన్నీ రాజకీయ సంస్థలే. ఆ సంస్థలకు, వాటి లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం, సహకరించడం, ప్రోత్సహించడం అనేవి అస్పష్టమైన మాటలు. ఒక హింసాత్మక చర్యను ప్రోత్సహించడం నేరమంటే అర్థముందిగానీ హింసాత్మక చర్యలకు పాల్పడే రాజకీయ సంస్థ లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం, సహకరించడం జీవితఖైదు విధించగల నేరం అంటే రాజకీయ భావాలను శిక్షించడం కాదా? హింసకూ రాజకీయాలకూ తేడా చూసేంత సున్నిత దృక్పథం మన న్యాయవ్యవస్థకు ఉందా? పోలీసు వ్యవస్థకు అసలే లేదు కదా? అందుకే 'పోటో' అనేది రాజకీయ స్వేచ్ఛపైన దాడి అంటున్నాం.

అంతేకాదు. ఒక నిషిద్ధ సంస్థ లేక టెర్రరిస్టు సంస్థ చేపట్టే హింసాకాండను సమర్థించకపోయినప్పటికీ ఆ సంస్థ ఆవిర్భావానికి మూలమైన పరిస్థితులను అవగాహన చేసుకోవడం అవసరమనీ వాటికి స్పందించడం అవసరం అనీ అంటామనుకోండి. ప్రభుత్వం వట్టి అణచివేత చర్యలతో వాటిని ఎదుర్కోవాలని చూడడం అన్యాయం అనీ మౌలిక సమస్యలకు జవాబు అన్వేషించాలనీ అంటామనుకోండి. హక్కుల ఉద్యమాలేకాక ప్రజాస్వామికవాదులందరూ తరచుగా ఈ రకంగా వాదిస్తుంటారు. అయితే ఈ రకమైన వాదన కూడా పరోక్షంగా ఆ సంస్థలకు మద్దతు, సానుభూతి, సహకారం కల్పిస్తుందని అనబోరా? టెర్రరిజానికి గల మూలాలను సహితం ప్రజాస్వామికంగా అర్థం చేసుకోవాలని వాదించేవారిని కటకటాల పాలు చేయబోరా?

'పోటో' పత్రికా స్వేచ్ఛ పైన దాడి అన్న విమర్శను కూడా వివరించడం అవసరం. నిషిద్ధ సంస్థల, టెర్రరిస్టు సంస్థల బాధ్యులు అప్పుడప్పుడు పత్రికా విలేకరులను పిలిచి రహస్య ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెడుతుంటారు. తమ కార్యకలాపాలనూ దృక్పథాన్నీ ప్రణాళికలనూ వివరిస్తుంటారు. పత్రికలు వీటిని ప్రచురిస్తుంటాయి. ఇది కూడా వారి 'కార్యకలాపాల'కు సహకరించడమే కాబట్టి 'పోటో' కింద ఇది నేరం. అంతేకాదు, ఆ రహస్య ప్రెస్ కాన్ఫరెన్స్‌కు పోయి వచ్చిన విలేకరి వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు అందిచ్చి ఆ నిషిద్ధ సంస్థ బాధ్యుడిని పట్టుకోవడానికి సహకరించాలి. లేకపోతే అది కూడా నేరమేనని పోటో అంటుంది.

ఇది కేవలం పత్రికల స్వేచ్ఛపైన దాడి కాదు. ప్రజల సమాచార స్వేచ్ఛపైన కూడా దాడి. ఒక సంస్థను ప్రభుత్వం నిషేధించినా టెర్రరిస్టు సంస్థగా ప్రకటించినా ఇంక ఆ పైన వారి మాటలు ఎవ్వరూ వినకూడదు, వారి భావాలనూ లక్ష్యాలనూ ఎవరూ తెలుసుకోకూడదు. వారిని పోలీసులు కాల్చి చంపిన వార్తలు మాత్రమే చదువుకోవాలి. ఆ సంస్థల ఆవిర్భావానికి మూలమైన సమస్యలను తెలుసుకోవడం, పరిష్కారాలు అన్వేషించడం సాధ్యం కాదు.

ఇది ప్రజలకుగానీ ప్రజాస్వామ్యానికిగానీ ఏ మాత్రం మేలు చేసే వైఖరి కాదని నొక్కి చెప్పనవసరం లేదు.

పోటోను వ్యతిరేకించడానికి ఇవీ ఇటువంటివీ ఇంకా చాలా కారణాలున్నాయి. వీటికి ఏ జవాబూ చెప్పే ప్రయత్నం చేయకుండా 'మమ్మల్ని కాదనే వాళ్లు దేశద్రోహులు' అన్న దబాయింపుతో తమ పని కానిచ్చేసుకుందామని చూస్తున్న మన పాలకుల వైఖరికి తలొగ్గకూడదు. దేశభక్తి వారి గుత్తసొమ్ముకాదు, వారు సర్టిఫికేట్ ఇయ్యనంత మాత్రాన మనం దేశభక్తులం కాకుండా పోము.

పోటోకు చట్టరూపం ఇచ్చే ప్రయత్నాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిద్దాం రమ్మని ప్రజలందరినీ ఆహ్వానిస్తూ-

హైదరాబాద్

**04.12.2001**

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపిసిఎల్‌సి)

మానవహక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్)

ప్రజాస్వామికహక్కుల పరిరక్షణ సంస్థ (ఒపిడిఆర్)

పౌరహక్కుల ప్రజాసంఘం (పియుసిఎల్)